ప్రజాశక్తి
బుధవారం 25 డిసెంబర్ 2024

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పుల్లారెడ్డి

కొనుగోళ్లలో అప్రమత్తత అవసరం

• చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి • జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలని, వినియోగదారులకు రూపొందించిన చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. మంగళవారం సిల్వర్ జూబ్లీ కళాశాల ఆడిటోరియంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, క్లస్టర్ యూనివర్సిటీ విసి డివిఆర్ సాయిగోపాల్ పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల చట్టంలో వివిధ రకాల సవరణలు చేశారని, తద్వారా ఆన్‌లైన్ మాధ్యమంలో కొనుగోలు చేసిన వస్తువులు కూడా ఈ చట్టం పరిధిలోకి వస్తాయన్నారు. నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసే సమయంలో నాసిరకం, ఎక్స్‌పైరీ మందులు కొనుక్కోకుండా జాగ్రత్తలు పాటిస్తూ ఎంఆర్‌పి ధరలకే కొనుగోలు చేయాలన్నారు. రోడ్ల మీద చేసే విక్రయించే ఆకర్షణీయమైన తినుబండారాలను తినడం వల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుందని, అలాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కళాశాల ఆవరణంలో వివిధ శాఖల వారు ఏర్పాటు చేసిన స్టాల్స్,ల్యాబ్స్ ను విద్యార్థులు కూడా పరిశీలించాలన్నారు. ఈ మధ్య సైబర్ నేరాల ఎక్కువ శాతం పెరిగాయని అందుకు వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. జాగృతి యాప్ ద్వారా వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. విసి సాయి గోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల గ్రూపుల వారీగా ఏర్పాటు చేసి వినియోదరుల కమిషన్ సభ్యుల సలహాలను కూడా

సమావేశంలో మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

తీసుకుంటారన్నారు. వినియోగదారులు ఏ వస్తువు కొన్నా అందులో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ఈ చట్టాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వినియోగదారుల సంఘం సభ్యులు నారాయణ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల కమిషన్ పనితీరు విపులంగా వివరిస్తూ వినియోగదారుడు కొన్న వస్తువుల్లో కానీ, సేవల్లో కానీ ఏదైనా లోపం ఉంటే అది క్వాలిటీ, క్వాంటిటీ, ప్యూరిటీ తదితర ఎలాంటి లోపాలు ఉన్నా వినియోగదారుల హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ వినియోగదారుల కమిషన్‌లో జ్యుడీషియల్ పదవిలో ఉద్యోగ విరమణ పొందిన వారు ఉంటారన్నారు. వినియోగదారుడు ఫిర్యాదు చేసిన 21 రోజుల్లో నెంబర్ ఇచ్చి 90 రోజుల్లో కేసులను పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. కమిషన్ ఆర్డర్ ఇచ్చిన 45 రోజుల్లో నగదు చెల్లించాలని లేని యెడల మూడేళ్ల జైలు శిక్ష, రూ.25వేల నుండి రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల ఆవరణంలో ప్రాంతీయ ప్రయోగశాల నీటి నమూనాల పరిశీలన స్టాల్, తూనికల కొలతల శాఖ స్టాల్, ఔషద, ఫుడ్ సేఫ్టీ స్టాల్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి సుబ్రమణ్యకుమార్, సివిల్ సప్లయి డిఎం సంధ్యారాణి, ఆర్‌డిఒ లాల్ సింగ్ చౌహాన్, ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్, ఎల్‌డిఎం రామచంద్ర రావు, మున్సిపల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వరరెడ్డి, ఔషద నియంత్రణ అధికారి రమాదేవి, వినియోగదారుల సంఘం కార్యదర్శి శివమోహన్ రెడ్డి, సివిల్ సప్లయ్ సిబ్బంది, కెవిఆర్ కళాశాల, సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులు, వాగులను రక్షించాలి

• కబ్జాదారులను శిక్షించాలి • పర్యావరణాన్ని కాపాడాలి
• దళితుల భూమినీ వదలని కబ్జాదారులు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు సమీపంలోని గార్గేయపురం, బి.తాండ్రపాడు చెరువులను, కబ్జాల నుండి రక్షించి పంట పొలాలను మత్స్యకారులను, పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ వివిధ ప్రజా సంఘాలు కలిసి నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం పిపిఎస్ఎస్, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జాతీయ మత్స్యకారుల సంఘం నగర అధ్యక్షులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ చెరువుల కబ్జాల వల్ల మత్స్యకారుల వృత్తి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల వివక్ష వ్యతిరేక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌జి.కృష్ణ మాట్లాడుతూ 40 ఏళ్లుగా దళితుల అనుభవంలో కొద్దిపాటి భూమిని బిల్డర్లు ఆక్రమించుకున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం.నాగరాజు, వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు డి.శ్రీనివాసరెడ్డి, బి.వన్నూరుసాహెబ్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి చెరువులను వాగు లను, నదులను బిల్డర్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి ప్లాట్లు వేసి వ్యాపారం చేస్తుంటే పాలకులు, ప్రభుత్వ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బోరింగులకు, తాగునీటికి, పంట పొలాలకు నీరు అందించే చెరువులను కాపాడాలని కోరారు. చెరువులు వాగుల వల్ల పర్యావరణానికి ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కూటమి ప్రభుత్వ పెద్దలు కర్నూలు చుట్టూ జరుగుతున్నా భూ కబ్జాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బట్టలు ఉతికేందుకు రజకులకు నీళ్లు కూడా కరువయ్యే పరిస్థితులు రాబోతున్నాయన్నారు. గార్గేయపురం చెరువు సమీపంలో ఇరిగేషన్ అధికారులు వేసిన సిమెంట్ రోడ్డు కూడా కబ్జాకు గురైందని తెలిపారు. చెరువులను వాగులను వంకలను కబ్జాల నుండి కాపాడాలని నీటిపారుదల శాఖ డివిజనల్ ఇంజనీరు సుష్మకు వినతిపత్రం ఇచ్చారు. బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం యాకోబు, బి.నాగేంద్ర, ఎ.గురుస్వామి, ఎండి యూనుస్, ఎన్ పీటర్, ఎ.వెంకటేశ్వర్లు, కె.మధు, ఎస్.అన్వర్, సివి వర్మ, ఎస్ఆర్.గౌడు, రహిమాన్, రుస్తుం పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రూ. 1.25 లక్షల రికవరీ

- బాధితురాలికి అప్పగించిన త్రీ టౌన్ పోలీసులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) ద్వారా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకి, కర్నూలు జిల్లా ఎస్‌పి జి.బిందుమాధవ్‌కు కర్నూలు మూడవ పట్టణ పోలీసులకు బాధితురాలు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు బుధవార పేటకు చెందిన నస్రేనా సుల్తానా బాధితురాలు. ఆమె ఉద్యోగం కొరకు ఆన్‌లైన్‌లో ప్రయత్నిస్తున్నప్పుడు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన అనిల్ యాదవ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి బాధితురాలైన నస్రేనా సుల్తానాకు సైబర్ మోసానికి గురి చేశాడు. గత నెలలో కర్నూలు జిల్లా ఎస్‌పి నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్‌కు ఫిర్యాదు చేసి విన్నవించారు. ఈ విషయంపై కర్నూలు జిల్లా ఎస్‌పి కర్నూలు త్రీ టౌన్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతికతను ఉపయోగించారు. త్వరితగతిన పరిష్కారం చేసి బాధితురాలు పోగొట్టుకున్న రూ. ఒక లక్ష 25 వేలు రికవరీ చేసి అందజేశారు.

కృతజ్ఞతలు తెలుపుతున్న బాధితురాలు నస్రేనా సుల్తానా

ఏసుక్రీస్తు పుట్టిన రోజే క్రిస్మస్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ప్రధాన పండుగ క్రిస్మస్ కుల, మతాలకతీతంగా పరస్పరం ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలుపుకుంటూ అందరూ కలిసి సంబరం చేసుకునే పండుగ క్రిస్మస్ నవంబర్ 25న సపోజ్ క్రిస్మస్‌తో మొదలయ్యే ఈ సంబరాలు ఈనెల 25 క్రిస్మస్ రోజుతో అంబరాన్నంటే స్థాయికి చేరుకుంటాయి. గత కొన్నేళ్లుగా ప్రతి విద్యా సంస్థల్లోనూ, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలలోనూ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ యేడాది కూడా వీధి, వీధిన కార్యక్రమాలు ఏర్పాటు చేసి క్రిస్మస్ ప్రాముఖ్యతను ప్రజలకు చాటి చెప్పారు. ఏసుక్రీస్తు సిలువ శిక్షకు గురై ప్రాణాన్ని ఫణంగా పెట్టిన ప్రేమామయుడని, మూడో రోజు మృత్యువును జయించి తిరిగి లేచిన జయశీలుడని క్రిస్మస్ కార్యక్రమాలలో బోధకులు చెబుతారు. పటుచోట్ల రాజకీయ నాయకులు క్రిస్మస్ కార్యక్రమాలకు హాజరై క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపి కొవ్వొత్తులను వెలిగిచి ఆరాధనల్లో పాల్గొన్నారు. ఇప్పటికే యూట్యూబ్‌లో క్రిస్మస్ సంబరాల పాటలు హోరెత్తుతుండగా, ఆయా చర్చిలలో క్రిస్మస్ రోజు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గీతాలను గాయక బృందాలు రిహార్సల్స్ కూడా చేసేశారు. క్రిస్మస్ ఆరాధనకు ముందు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని సెమీ క్రిస్మస్ లేదా సపోజ్ క్రిస్మస్ లేదా క్యాండిల్ లైటింగ్ సర్వీసు అని అంటారు. ఈ కార్యక్రమంలో క్రీస్తు జన్మ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ఆయనను ఆరాధిస్తారు. కార్యక్రమంలో క్రీస్తును ఆరాధించిన తరువాత కొవ్వొత్తులు వెలిగించి, ప్రత్యక గీతాలు పాడిన అనంతరం మిఠాయిలు, కేకులు పంచి తమ సంతోషాన్ని, ప్రేమను ఇతరులతో పంచుకుంటారు.

విద్యుద్దీప కాంతుల్లో వెలుగుతున్న ప్రార్థనా మందిరాలు

క్రిస్మస్‌కు రెండు వారాల ముందునుంచే నగరంలోని ఆయా ప్రధాన ప్రార్థనాలయాలు విద్యుద్దీప కాంతులతో వెలగిపోతున్నాయి. తళుకు తళుకు మంటూ మెరిసే నక్షత్రాలు, బెలూన్స్, గంటలు, క్రిస్మస్ ట్రీలు అందంగా ఏర్పాటు చేశారు. ప్రార్థనాలయాల ముందు ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద నక్షత్రాలు వెలుగుతో కర్నూలు నగరం రాత్రిళ్లు కూడా పట్టపగలుగా వెలిగిపోతోంది.

షాపింగ్......షాపింగ్

వస్త్ర ప్రియుల అభిరుచులకు అనుగుణంగా పలు షాపింగ్ మాల్స్ ఆఫర్లను ఇవ్వడంతో షాపింగ్ మాల్స్ క్రిక్కిరిశాయి. ఏ షాపింగ్ మాల్ కెళ్లినా విపరీతమైన రద్దీ కనిపిస్తోంది. క్రైస్తవులే కాకుండా ఇతరులు కూడా షాపింగ్‌లో బిజీ బిజీగా కనిపించారు.

పిండి వంటలకు సర్వం సిద్ధం

ఇంటికి ప్రత్యేకంగా అతిథులను పిలవాలంటే, వారికి ఘుమ ఘుమలాడే రుచికరమైన వంటలు పెట్టాలి అనే ఆలోచనతో రెండు రోజుల ముందుగానే పిండి వంటల సరుకులన్నీ సమకూర్చుకున్నారు. క్రిస్మస్ ఈనెల 25న అయినప్పటికీ మంగళవారం నుంచే వీధి వీధిన ఘుమ ఘుమలు మొదలయ్యాయి. ఇంటికి వచ్చిన ఆడ బిడ్డలతో, బంధుమిత్రులతో వీధులన్నీ సందడి సందడిగా కనిపిస్తున్నాయి. ఇండ్లకు రంగులు వేసి, ఇండ్లపైన స్టార్‌లను ఏర్పాటు చేసుకున్నారు. క్రిస్మస్ రోజు ఉదయ్యాన్నే క్రైస్తవులంతా వారి వారి ప్రార్థనా మందిరాలకు వెళ్లి భక్తి శ్రద్ధలతో క్రీస్తును ఆరాధించి, ఇరుగు పొరుగు వారికి క్రీస్తు ప్రేమను ప్రకటించి వారిని ఇంటికి ఆహ్వానిస్తారు.

ముస్తాబైన కోల్స్ చర్చి

ముస్తాబైన చర్చి

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జర్నలిస్టులపై పెడుతున్న పోలీసుల తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలని జర్నలిస్టులు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట మంగళవారం జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు.. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు గోరంట్లప్ప, కెబి శ్రీనివాసులు, ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డి.హుస్సేన్, సాక్షి బ్యూరో రవి వర్మ, ఎన్‌టివి కరస్పాండెంట్ చంద్రశేఖర్, టివి9 కరస్పాండెంట్ నాగిరెడ్డి, సాక్షి కరస్పాండెంట్ లోకేష్, వార్త స్టాఫ్ రిపోర్టర్ రవి ప్రకాష్, యునైటెడ్ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నీలం సత్యనారాయణలు మాట్లాడారు. ఇటీవల కాలంలో పోలీసులు జర్నలిస్టులకు సాక్షి దినపత్రికలో రాసిన వార్తకు సాక్షి జర్నలిస్ట్ కెబి శ్రీనివాలుకు పోలీసులు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు గురిచేయడం సరైంది కాదన్నారు. వాస్తవాలను రాస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులను పెట్టడం దుర్మార్గచర్యని వారు ఖండించారు. పోలీసులు ఇప్పటికైనా ఇలాంటి చర్యలను విరమించుకోకపోతే జర్నలిస్టు సంఘాలు ఐక్యంగా ఉద్యమిస్తాయని పేర్కొన్నారు. అనంతరం డిఆర్ఒ వెంకట నారాయణమ్మకు వినతిని అందించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు నాగేంద్ర, రమేష్, సీనియర్ జర్నలిస్ట్ లు రాజశేఖర్ నాయుడు, శ్రీనాథ్ రెడ్డి, విజయ్ కుమార్,విజయకరణ్, దామోదర్,అనిల్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు

ప్రేమ నక్షత్రాన్ని ఉదయింప జేయి

శాంతి సామ్రాజ్యాన్ని, ప్రేమ, కరుణను స్థాపించాలని జన్మించావు ప్రభూ,
కానీ నేటి ప్రభువులు రాజ్య కాంక్షతో రాజ్య విస్తరనే లక్ష్యంగా మారణ హోమము చేస్తున్నారు. దీనుల నిస్సహాయుల ఆకలి బాధ తీర్చాలని అను కున్నావే గానీ వారిని బానిసలుగా మార్చి ఆకలిని పెంచాలనుకోలేదు.

మానవత, ప్రేమ, సేవ నీ మతం, సర్వ మానవ సమానత్వం నీ మార్గం, నీ శాంతి బాటలో నడుస్తూ నీ ప్రేమ మార్గాన్ని అనుసరించే ప్రతి వారికీ నాడే కాదు, నేడు కూడా ఎదురవుతున్నది హింస, మరణంమతోన్మాదం, యుద్ధ పిశాచం పట్టి పీడిస్తున్నది ప్రభూ, నేటి యీ మానవ సమాజాన్ని, కుల మత జాడ్యం పెచ్చు మీరి మనిషిని మనిషి, జాతిని జాతి, దేశాన్ని దేశం కాటు వేస్తూ నేరాలు అకృత్యాలు, అత్యాచారాలు ఊచ కోతలు విరగబడి వికటంగా నవ్వు తున్నాయి ప్రభూ...

నీవు జన్మించి రెండువేల వత్సరాలు గడిచినా యింకా మనుషులు రాక్షసులుగా తిరో గమనం చెందుతూ విజృంభించి విర్ర వీగుతున్నారే గానీ, నీలా భగవత్ స్వరూపునిగా రూపాంతరం చెందడం లేదెందుకు?

సాంకేతికతకాదు,సాటి మనిషిపై జాలి, దయ, ప్రేమ ఉదయించాలి యీ క్రిస్మస్ పర్వ దినాన ఓ యేసు ప్రభూ, నీ శాంతిని, కాంతిని, క్రాంతిని మళ్ళీ భువిపై ఉదయింప జేయి, అజ్ఞాన అంధ కారాన్ని తరిమి కొట్టే నీ ప్రేమ నక్షత్రాన్ని మనసుల్లో ఉద్భ వింప జేసి ఆప్యాయత వెలుగులు ప్రసరింప జేయి, ప్రేమ దీప్తులను వెలిగించు ప్రభూ...



డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా, రచయిత, కర్నూలు

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

అధికారులకు రోడ్డు సైడు చిన్నవ్యాపారుల సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

చిన్న వ్యాపారస్తులకు రక్షణ కల్పించాలని 2013లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని రోడ్ సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘం (సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి ఎండి రఫీ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు మున్సిపల్ పరిధిలోని గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో గత 30 యేళ్లుగా నిరుద్యోగులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక రోడ్ సైడ్ వ్యాపారులుగా తోపుడుబండ్లపై అరటి పళ్ళు ఆపిల్ తదితర వస్తువులు పెట్టుకొని వ్యాపారాలు సాగిస్తూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఈ మధ్యకాలంలో మున్సిపల్ అధికారులు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఒక గుత్తేదారుకు వ్యాపార నిమిత్తం రూ.ఆరు లక్షలకు టెండర్‌కు ఇచ్చారని, టెండర్ దక్కించుకున్న గుత్తేదారు అక్కడ ఉన్న చిరు వ్యాపారుల ప్రతి బండికి రోజుకు రూ.250 ఇస్తేనే బండ్లు పెట్టనిస్తామని, లేదంటే బండ్లు తీసేయాలని హుకుం జారీ చేస్తూ చిన్న వ్యాపారస్లను భయభ్రాంతులకు గురి చేస్తూ బంకులను తొలగిస్తామని హెచ్చరించడాన్ని సిఐటియు చిన్న వ్యాపారస్తుల సంఘం ఖండిస్తుందన్నారు. మంగళవారం విషయం తెలిసిన రోడ్ సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘం నగర ప్రధాన కార్యదర్శి ఎండి రఫీ, ఆసంగం ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, అక్బర్ గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని బంకులను పరిశీలించి చిన్న వ్యాపారస్తులను విచారిస్తుండగా అప్పుడే అక్కడికి వచ్చిన మున్సిపల్ అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణను కలిసి ఇక్కడ జరుగుతున్న అన్యాయాన్ని గురించి వివరించారు. ఎండి.రఫీ మాట్లాడుతూ చిన్న వ్యాపారస్తులకు రక్షణ కల్పించాలని, 2013లో సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందని దీనిని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించినా ఆతీర్పును అధికారులు అమలు చేయకపోగా చిన్న వ్యాపారస్తులను వివిధ కారణాలతో తొలగించడం సరికాదన్నారు. కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్న అధికారులు చిన్న వ్యాపారస్తులను పట్టించుకోకపోవడం సిఐటియుగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. 30 చేళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ అనేకమంది అక్కడ జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారికి రక్షణ కల్పించాల్సిన అధికారులు గుత్తేదారుకు వంత పాడడం సరికాదన్నారు. చిరు వ్యాపారులను అక్కడ నుంచి తొలగిస్తే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారులు తక్షణమే ఆలోచించి గుత్తేదారులకు ఇచ్చిన టెండర్లను రద్దు చేయాలని, చిన్న వ్యాపారస్తుల తొలగింపు మానుకోవాలని అదనపు కమిషనర్‌ను కోరారు. చిన్న వ్యాపారస్తులు ఎవరు భయపడవద్దని సిఐటియు మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైసిపి 25 వార్డు కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి, చిన్న వ్యాపారస్తుల సంఘం కృష్ణానగర్ నాయకులు అక్బర్, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎండి.రఫి , తదితరులు

జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : క్రిస్మస్ పండుగని పురస్కరించుకుని మంత్రులు నిమ్మల రామానాయుడు టిజి. భరత్, జిల్లా కలెక్టర్ బి.రంజిత్‌బాష, జిల్లా ప్రజలకు మంగళవారం ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు అనుసరించిన మార్గం ఎంతో ఆదర్శమన్నారు. జిల్లాలోని క్రైస్తవ సోదరసోదరీమణులు అందరూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా, సంతోషంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

విద్యార్థి యువజన సంఘాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎఐ చదువుతున్న రామ్‌ప్రసాద్ పెద్దటేకూరు దగ్గర ఈతకు వెళ్లి మృతిచెందాడు. ఈత కూడా రాని రాంప్రసాద్ రెడ్డి మిత్రులతో కలిసి ఈతకెళ్ళి చనిపోయినట్టు వారి మిత్రుల ద్వారా కుటుంబ సభ్యులకు ,బంధువులకు సమాచారం ఇచ్చారు. అయితే ఈవ్యవహారంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విద్యార్థి యువజన సంఘాలు ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మార్చురి ముందు ఆందోళనకు దిగారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఐసా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. కళాశాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఒకే ఒక కొడుకు నలుగురు కూతుర్లు ఉన్న తండ్రి మంచి ఉన్నత విద్యావంతుడై కుటుంబాన్ని పోసిస్తాడని తల్లితండ్రులు బావించారన్నారు. హాస్టల్ నుండి బయటికి వెళ్లాలంటే అవుట్ పాస్ ఉండాలని, తల్లిదండ్రుల పరిమిషన్ ఉండాలనే కళాశాల యజమాన్యం అలా ఎందుకు వ్యవహరించ లేదని ప్రశ్నించారు. వెంటనే ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కళాశాల యాజమాన్యంపై మరోసారి ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పిఎస్ఎన్ జిల్లా కన్వీనర్ అమర్, నాయకులు హర్ష, మనోహర్, చింటూ, శంకర్ డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ బాష పాల్గొన్నారు.

స్నేహితులతో ఈతకు వెళ్లి చనిపోయాడు: కెవిసుబ్బారెడ్డి

స్నేహితులతో ఈతకు వెళ్లి ఈత రాక మృతిచెందాడని కెవిసుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కెవి సుబ్బారెడ్డి తెలిపారు. తోటి విద్యార్థులు ,పోలీసులు, ఈవిషయం ధృవీకరించారన్నారు. బిటెక్ చదివే విద్యార్థులకు బయటకు వెళ్లకుండా కఠిన నిబంధలు హాస్టల్లో ఉండవని, ఆహాస్టల్‌నుంచి బయలు దేరితే కళాశాలకు వెళ్లాడని అనుకుంటామన్నారు. మా సంస్థలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకుంటామన్నారు. ఎంతో జాగ్రత్తగా వ్యవహరించినా ఇలాంటి ఘటన జరగడం దురదృష్టమని ఆవేదన వ్యక్తం చేశారు.

నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని, అనుసరణీయమని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు శ్రీనివాస నగర్ స్టాంటన్ బాప్టిస్ట్‌చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్రిస్మస్ కేక్‌కట్ చేశారు. చర్చి ఫాదర్ దేవ సహాయం, మేరీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ఏసుప్రభువు ప్రజల పాపాలను తొలగించేందుకు ఈ భూమి మీదకు వచ్చారని వివరించారు. అందరూ ప్రేమ, ఆనందం, సహాయం, సేవా గుణాలతో జీవించాలని ఏసుప్రభువు సూచించారన్నారు. ఇది అందరూ పాటించాలని చెప్పారు. సమాజంలో క్రైస్తవులు అతి సున్నిత మనస్కులని వారి జీవన విధానం అందరికీ ఆదర్శప్రాయమని చెప్పారు. ముఖ్యంగా మదర్ తెరిసా లాంటివారు ఇతర దేశాల నుంచి వచ్చి పేదల కోసం చేసిన సేవలు అందరికీ ఆదర్శమని వివరించారు. ప్రతి ఒక్కరూ పరమత సహనం పాటించాలని ఇతరుల మతాలను గౌరవిస్తూ జీవించాలని సూచించారు. అన్ని మతాలను సమానంగా ఆదరించడం మన దేశం ప్రత్యేకతను వివరించారు. దేశంలో క్రైస్తవ సంస్థలు, క్రైస్తవ హాస్పిటల్ లు, క్రైస్తవ మిషనరీలు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. క్రిస్మస్ పర్వదినాన్ని ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో ఘనంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఏసుక్రీస్తు ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడవాలని బైబిల్ ద్వారా సూచించారని వెల్లడించారు. బైబిల్‌గ్రంధాన్ని కుల,మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసిపి పోరుబాట

ప్రజాశక్తి-వెల్దుర్తి

పత్తికొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వెల్దుర్తి మండల పరిధి లోని చెరు కులపాడు స్వగృహంలో ఈ నెల 27న విద్యుత్ చార్జీల పెంపు పై వైసిపి పోరు బాట కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. వైసిపి నాయకులు క్రిష్ణగిరి ఎంపిపి డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, పత్తికొండ ఎంపిపి నారాయణదాసు, వెల్దుర్తి జడ్‌పిటిసి సుంకన్న, పెండెకల్ భాస్కర్ రెడ్డి, బొమ్మిరెడ్డి పల్లె మధు సుధన్ రెడ్డి, రత్నపల్లి రమణారెడ్డి, సంగాల కురువ రామకృష్ణ, గూడెంపాడు శ్రీనాథ్ రెడ్డి తదితరులతో ఆమె పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

విద్యుత్ ఉద్యమ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కె.శ్రీదేవి

త్వరలోనే కోర్టు భవన నిర్మాణం పూర్తి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కపర్తి

ప్రజాశక్తి - ఆదోని

అన్ని సదుపాయాలతో ఆదోని కోర్టు భవనాల సముదాయ నిర్మాణం పూర్తవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కపర్తి తెలిపారు. మంగళవారం నిర్మాణ పనులను అక్కడ పరిస్థితులను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో కోర్టు నిర్మాణ పనులు జరుగుతుండడం వల్ల భవనాల కొరత వేధిస్తోందని తెలిపారు. న్యాయవాదులు, కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందరికీ సౌకర్యాలతో కూడిన భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది జూన్ చివరికల్లా భవనం పూర్తి చేసి అప్పగిస్తారని తెలిపారు. అంతకుముందు సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞ నారాయణ, అడ్వకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎల్‌కె.సుందర్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ ఎం.జనార్ధన్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సబ్ జైలును సందర్శించి ఖైదీలతో మాట్లాడి ఉద్యోగులతో సమస్యలను తెలుసుకున్నారు. నిర్మిస్తున్న కోర్టు భవనాన్ని సందర్శించి బిల్డింగ్ పర్యవేక్షణ చేసే ఇంజినీర్‌ను ఎప్పట్లోపు పూర్తి చేస్తారో అడిగి తెలుసుకున్నారు. త్వరగా భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా న్యాయవాదులు శ్రద్ధ చూపాలన్నారు. ఏళ్ల తరబడి కేసులు పెండింగ్ ఉండడం వల్ల ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందన్నారు. కోర్టులో ఉద్యోగుల కొరత ఉందని, కేసులకు సంబంధించిన సాంకేతిక సమస్యలు ఉన్నాయని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుందర్ సింగ్ ఆయన దృష్టికి తెచ్చారు. అన్ని సమస్యలను సానుకూలంగా విన్న ఆయన పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ అడ్వకేట్ విశ్వనాథ్ రెడ్డి, వైఆర్.మల్లికార్జున న్యాయవాదులు ఉన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కపర్తి

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - గోనెగండ్ల

రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్‌పై వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కెవిపిఎస్, ఎపిడికెఎస్, రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ఆనంద్ బాబు, సాయి ఉదయ్, కరుణాకర్, నరసింహులు, నరసింహుడు మాట్లాడారు. రాజ్యాంగబద్ధమైన హోదాలో ఉండి పార్లమెంటులో రాజ్యాంగంపై జరుగుతున్న చర్చలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను చులకన చేస్తూ హాస్యంగా మాట్లాడడం అమిత్ షా వ్యక్తిత్వానికి, రాజ్యాంగం పట్ల ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమిత్ షా చేత జాతికి క్షమాపణలు చెప్పించాలని, లేకపోతే ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రంగస్వామి, శివ, శేఖర్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వివిధ గ్రామాల హౌసింగ్ లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల ప్రక్రియను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నమరివీడు, కులుమాల గ్రామాల హౌసింగ్ లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఎన్ని పూర్తయ్యాయి.. ఇంకా కొంతమంది ఎందుకు ఆసక్తి చూపడం లేదనే విషయాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. గతంలో పిఎంఎవై కింద 2020-21లో మంజూరయిన అన్ని ఇళ్లను మార్చి 2025 నాటికి పూర్తి చేయాలన్నారు. మండలంలో బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న 197 ఇళ్లకు ఉపాధి హామీ చట్టం కింద అకౌంట్లలో పడిన డబ్బును కాంట్రాక్టర్‌కు ఇప్పించి తిరిగి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆదేశించారు. హౌసింగ్ డిఇ ఎస్‌వి.ప్రసాద్, ఎంపిడిఒ మణిమంజరి, ఇఒఆర్‌డి అనంతశయన, హౌసింగ్ ఎఇ షేక్షావలీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మన్న పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఎలా చదువుకోవాలి..?

- విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన
- గిరిజన విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులు లేకుండా తామెలా చదువుకోవాలంటూ విద్యార్థులు ప్రశ్నించారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనకు ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు బోటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఉమేష్ మాట్లాడారు. ఆలూరులోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల బాలికల పాఠశాల మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులకు విద్యనందించడం ద్వారా వారిని అభివృద్ధి చేయడానికి, సమాజంలో వారి ప్రాముఖ్యతను పెంచడానికి ఏర్పాటు చేశారని చెప్పారు. ఇందులో ప్రస్తుతం నెరణికి తండా, అరికెర తండా, కొత్తపేట గ్రామాల విద్యార్థులే కాక ఇతర ప్రాంతాల విద్యార్థులు 297 మంది 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారని తెలిపారు. మంచి ఉత్తీర్ణత సాధించడంతో ట్రిపుల్ ఐటి సీట్లు కూడా పొందారన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు దాదాపు 40 రోజులుగా సమ్మెలో ఉంటున్నా ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రెండు నెలల్లో పబ్లిక్ పరీక్షలు ఉన్నాయని, విద్యార్థులు ఎలా చదువుకోవాలని ప్రశ్నించారు. వెంటనే గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి వారు వెంటనే హాజరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. లేకపోతే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ శంకర్ నాయక్, వైస్ ఛైర్మన్ లెక్క నాయక్, తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నీలకంఠ నాయక్, రవి నాయక్, డాకే నాయక్, డివైఎఫ్ఐ నాయకులు వీరేష్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన

'మధ్యాహ్నం'పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎంఇఒ

ప్రజాశక్తి - నందవరం

పాఠశాలలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పథకం విషయంలో వంట ఏజెన్సీలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంఇఒ సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం నందవరం ఎంపిపి (తెలుగు మెయిన్) పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల సంబంధిత రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు శుచితో పాటు రుచికరంగా అందించాలని వంట ఏజెన్సీకి సూచించారు. అనంతరం విద్యార్థులకు గణితానికి సంబంధించిన సులభంగా, తొందరగా అర్థమయ్యే రీతిలో చతుర్విధ ప్రక్రియలు, జామెట్రీకి సంబంధించి సులభ పద్ధతులను అర్థవంతంగా చక్కగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ శుచి, శుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని తెలిపారు. మెనూ పాటించని పాఠశాలల వంట ఏజెన్సీలను రద్దు చేసి.. కొత్త వారిని నియమిస్తామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజనం విషయంలో ఆయా పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, హుస్సేన్‌బీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

'నారాయణ ప్రైమ్'లో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆస్పరి

నారాయణ ప్రైమ్ స్కూల్‌లో సపోజ్ క్రిస్మస్ వేడుకలు కరస్పాండెంట్ నరేష్ ఆచారి దూరంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం క్రిస్మస్ వేడుకల సందర్భంగా నారాయణ ప్రైమ్ స్కూల్‌లో మేరీమాత, క్రిస్మస్ తాత వేషధారణలో విద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ పండగను ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్, అకాడమిక్ డీన్ షేక్ నీజం, ఉపాధ్యాయులు గాయత్రి, లావణ్య, చంద్రకళ, నిర్మల, అంజినమ్మ, సౌమ్యా, రమాదేవి, పద్మావతి, తులసి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** **(రూరల్)** పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సిఇఒ అనిల్ కుమార్ ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ మాచాని కవిత ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు అనురాధ, వైస్ ప్రిన్సిపల్ నాగరాజు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

ఖాళీ పోస్టులకు

నోటిఫికేషన్ విడుదల చేయాలి

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి

ప్రజాశక్తి -ఆలూరు

విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, మండల కార్యదర్శి షాకీర్ కోరారు. మంగళవారం ఆలూరు సబ్ డివిజన్ పరిధిలోని హోళగుంద మండలం కోగిలతోట సబ్ స్టేషన్‌లో ఖాళీగా ఉన్న ఆపరేటర్ పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని ఆలూరు సర్కిల్ పరిధిలోని డిఇఇ లేకపోవడంతో ఎఇ గుర్రప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుత్ శాఖలో ఆలూరు సబ్ డివిజన్ పరిధిలో చాలా ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్న పోస్టులను నోటిఫికేషన్ ద్వారా కాకుండా అక్రమ నియామకాల ద్వారా నియమిస్తున్నారని తెలిపారు. ఇటీవల కోగిలతోట సబ్ స్టేషన్‌లో ఆపరేటర్ పోస్టులను నియమించిన తొమ్మిది నెలల తర్వాత నకిలీ సర్టిఫికెట్లు ఉన్నాయని విచారణలో తేలడంతో వారిని తొలగించారని చెప్పారు. ఈ తతంగమంతా విద్యుత్ జిల్లా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం.. నోటిఫికేషన్ ఇవ్వకుండా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయకుండా నియమించడం వల్లే జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేసి అవినీతికి తావు లేకుండా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఘనంగా ఖాదర్ లింగ గంధోత్సవం

ప్రజాశక్తి - కౌతాళం

సాని ఖాదర్ లింగ స్వామి గంధోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. కౌతాళంలో వెలసిన శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి పదో ధర్మకర్త, ముతావలిగా 41 ఏళ్లు శ్రీసయ్యద్ సాహెబ్ పీర్ హుస్సేని చిస్తీ (సాని ఖాదర్ లింగ) జనవరి 2022న మృతి చెందారు. ఈయన ఉరుసు మహోత్సవం కర్ణాటకలోని బళ్లారి జిల్లా కురుగోడులో నిర్వహిస్తున్నట్లు 11వ ధర్మకర్త తనయుడు సయ్యద్ జైనుల్ ఆబుద్దీన్ చిస్తీ (మున్నాబాష) తెలిపారు. మంగళవారం గంధం, బుధవారం ఉరుసు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కౌతాళం జగద్గురు ఖాదర్ లింగస్వామి దర్గా నుంచి గంధం పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొని కర్ణాటక కురుగోడుకు బయల్దేరారు. కురుగోడు దర్గా ధర్మకర్త చిన్న మున్నా, కౌతాళం దర్గా పీఠాధిపతి సయ్యద్ ఖాదర్ బాషా హుస్సేని చిస్తీ, సోఫీ సర్ మస్త్ దర్గా వంశస్తులు సయ్యద్ దూద్ బాషా సర్ మస్త్, శిష్య బృందం, భక్తులు పాల్గొన్నారు.

తెరచుకున్న రేషన్ షాపులు

ప్రజాశక్తి - ఆదోని

రేషన్ షాపులు వదిలి వెళ్లాలని దుకాణాలకు బిజెపి నాయకులు తాళాలు వేసిన విషయం తెలిసిందే. దీనిపై డీలర్లు తన్వీర్ రాజు బాష తదితరులు సోమవారం జెసికి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు మంగళవారం పట్టణంలోని గౌలిపేట, గణేష్ సర్కిల్, వెంకన్నపేట, శంకర్ నగర్, క్రాంతి నగర్, కౌడల్ పేట, అంబేద్కర్ నగర్, ఎన్‌జిఒస్ కాలనీ, ఆలూరు రోడ్డు ప్రాంతాల్లో 9 దుకాణాల తాళాలు తెరిచి డీలర్లకు అప్పగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసుల సమక్షంలో దుకాణాల తాళాలు పగులగొట్టి స్టాక్ రికార్డును తనిఖీ చేసి ఉన్నతాధికారులకు వివరాలు పంపుతామని విఆర్ఒ రాజశేఖర్ గౌడ్ తెలిపారు. ఈనెల 3న బిజెపి నాయకులు తాళాలు వేయడంతో సంచలనంగా మారింది. ఎన్నడూ ఇలా జరగలేదని, ఇదేమి పద్ధతి అంటూ ఎమ్మెల్యే అనుచరులపై శాపనార్థాలు పెట్టారు డీలర్లు. మూకుమ్మడిగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించడంతో కృతజ్ఞతలు తెలుపుతున్నామని డీలర్లు గోపాల్, కృష్ణారెడ్డి, సత్య తెలిపారు.

IN THE COURT OF THE SECOND ADDITIONAL DISTRICT JUDGE KURNOOL AT ADONI.
E.P.No.50/2020 IN.AA 401/2017

BETWEEN:
M/S Shriram Transport Finance Co Ltd. ...Decree Holder

VERSUS

1. G.Pompapathi
2. M.Shakunthalamma. ...Judgment Debtors

Notice

To,
JDR No.1 and 2
1.G.Pompapathi s/o Ragayya, Hindu, major, H.No.2-76, BC Colony, Kurukunda Village Alur.
2.M.Shakunthalamma w/o Ramanji, Hindu, major, H.No.3-59, Kurukunda Village Alur. ...Judgment Debtors

Sir/Madam,
Take notice that honorable court has ordered substitute service of summons to above named JDR no.1 and 2 have to appear before the above mentioned court on 27.12.2024 at 10.30 am either personally or through your advocate and file objections if any otherwise the case will be decided exparte.

C.Giridhar, B.Sc.LLB
Advocate for Decree Holder
Adoni, Kurnool Dist.

సమన్వయంతో పని చేయాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపిపి గిరిజమ్మ సూచన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపిపి వై.గిరిజమ్మ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపిడిఒ శోభారాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు తమ శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సక్రమంగా ఇవ్వాలని, సంబంధిత గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు సమన్వయంతో ప్రతిపాదనలు పంపాలని, లేకపోతే సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాల బకాయిలు లబ్ధిదారులకు తప్పకుండా మంజూరవుతాయని, నూతన గృహాల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ శాఖ డిఇ లాలీ కృష్ణయ్య తెలిపారు. ఇప్పటికే సిసి రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.2.5 కోట్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పంచాయతీ రాజ్ శాఖ ఎఇ మల్లయ్య తెలిపారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఎంఇఒ మోహినుద్దీన్, ఇఒఆర్‌డి ప్రభావతి, సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, అంజినయ్య, వీరారెడ్డి, లింగారెడ్డి, ఎంపిటిసిలు వెంకటేష్ శెట్టి, రామాంజినేయులు, కార్యదర్శులు వేణుగోపాల్, మహేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి గిరిజమ్మ

బ్యాటరీ ట్రై సైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

- విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సోమన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

బ్యాటరీ ట్రై సైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బీసీ.సోమన్న, ఉపాధ్యక్షులు బి.శ్రీనివాసులు కోరారు. మంగళవారం వారు మాట్లాడారు. నెల్లూరులో నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో విహెచ్‌పిఎస్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ముగ్గురు వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు అందజేసినట్లు తెలిపారు. అన్ని రకాలుగా సౌకర్యవంతంగా ఉండి బ్యాటరీతో నడిచే ఈ ట్రై సైకిల్ చాలా బాగా ఉపయోగ పడుతుందని చెప్పారు. అవసరం ఉన్న జిల్లాలోని వికలాంగులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, యుడిఐడి కార్డు, రెండు ఫొటోలు, ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ లింక్ ఉండాలని తెలిపారు. ఇతర వివరాల కోసం వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సోమన్న, ఉపాధ్యక్షులు శ్రీనివాసులును సంప్రదించాలని కోరారు.

కురుబలకు పెద్దపీట వేయాలి

- బీసీ కార్పొరేషన్ ఎమ్‌డిని కోరిన మాన్వి దేవేంద్రప్ప

ప్రజాశక్తి - ఆదోని

బీసీ కార్పొరేషన్ పరిధిలో అమలయ్యే సంక్షేమ పథకాల్లో కురుమ/కురుబలకు పెద్దపీట వేయాలని కురుబ/కురుమ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప కోరారు. మంగళవారం బీసీ కార్పొరేషన్ ఎమ్‌డి మల్లికార్జునను కలిసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజయవాడలో బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయనను కలిసి బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రవేశ పెట్టాల్సిన పథకాల గురించి ఆయనతో చర్చించినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించారన్నారు. రాష్ట్ర కురుమ/కురుబ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కె.రామకృష్ణ ఉన్నారు.

మాట్లాడుతున్న దేవేంద్రప్ప

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు

కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని వైసిపి ఆధ్వర్యంలో పోరుబాట నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. మంగళవారం ఆలూరు ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో విద్యుత్ చార్జీల బాదుడుపై వైసిపి పోరుబాట గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడెలా రాష్ట్ర ప్రజలపై రూ.16 వేల కోట్లు ట్రూ అప్ చార్జీలు పెంచారని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని తెలిపారు. ఈనెల 27న ఆలూరులోని విద్యుత్ కార్యాలయానికి భారీ ర్యాలీతో చేరుకొని అధికారులకు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. **ఆదోని (రూరల్)**లోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడారు. నాయకులు చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు నరసింహులు, మహ్మద్ గౌస్, వార్డు కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, సందీప్ రెడ్డి, చలపతి, రామలింగేశ్వర యాదవ్ పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలం రాంపురం గ్రామంలోని స్వగృహంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి కరపత్రాలను విడుదల చేశారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, జిల్లా కార్యదర్శులు మురళీ మోహన్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, మంత్రాలయం, కౌతాళం, పెద్దకడబూరు మండల అధ్యక్షులు భీమిరెడ్డి, ప్రహ్లాదాచారి, రామ్మోహన్ రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు రవిచంద్ర రెడ్డి, ఉరుకుంద ఈరన్న స్వామి పాలక మండలి అధ్యక్షులు నాగరాజు గౌడ్, ఏకాంబర రెడ్డి, కౌతాళం మండల ఉపాధ్యక్షులు బుజ్జి స్వామి, అవతారం, పాల్ దినకరన్, వడ్డే రాము, రోగప్ప, శివరాముడు, శ్రీరాములు, రాము, నాగరాజు, నరసింహులు పాల్గొన్నారు.

ఆలూరులో గోడపత్రికలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆదోనిలో...

మంత్రాలయంలో

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సహేతుకంగా స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్ వ్యవస్థీకరణ : ఎంటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్ వ్యవస్థీకరణను సహేతుకంగా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్ ఫెడరేషన్ ఆదోని అధ్యక్షులు అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఫెడరేషన్ నాయకులు భాస్కర ఆచారి, బడుగు బసవరాజు సమక్షంలో ఎంఇఒ శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణలో సౌలభ్యం కోసం, భవిష్యత్తు అవసరాల కోసం పునర్ వ్యవస్థీకరణ చేపట్టిందని తెలిపారు. ఆదోనిలాంటి అతి పెద్ద మండలంలో మున్సిపల్ పాఠశాలల విషయంలో గల అసంబద్ధాలను సరి చేయాలని కోరారు. ఈ ప్రక్రియలో పాఠశాల పేరెంట్స్ కమిటీ విన్నపాలనూ పరిగణనలోకి తీసుకొని ఆయా పాఠశాలలను మ్యాపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌లో మండగిరి ప్రాథమిక పురపాలక పాఠశాల ఉందన్నారు. ఆ పాఠశాలను ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మ్యాపింగ్ చేయరాదని కోరారు. ఎంటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, జిల్లా నాయకులు ఆనంద్ ఉన్నారు.

29, 30న జిల్లా మహాసభలు

- జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 29, 30న ఎమ్మిగనూరులో జరిగే సిపిఎం 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ నాయకులు రాముడు, కృష్ణ కోరారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీ ఆటో కార్మికులకు కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో ప్రధానంగా ఇంటి స్థలాలు లేక ప్రజల అవస్థలు పడుతున్నారని తెలిపారు. డ్రెయినేజీ సమస్యలు, పేదల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టేందుకు ఎమ్మిగనూరులో జరిగే సిపిఎం జిల్లా మహాసభలు వేదిక కానున్నాయని చెప్పారు. ప్రజలు, కార్మికులు, చేనేత కార్మికులు, ఆటో కార్మికులు, చేతివృత్తిదారులు, భవన నిర్మాణ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు తరలివచ్చి మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఎపి చేనేత కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి కాలప్ప, సిపిఎం ఎన్‌టిఆర్ కాలనీ కార్యకర్తలు వలీ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

దళారులను నమ్మి మోసపోవద్దు

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్
- దేగులపాడులో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - చిప్పగిరి

పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పిస్తామని కొంతమంది ముందుకొస్తున్నారని, అలాంటి దళారులను నమ్మి మోసపోవద్దని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ రైతులకు సూచించారు. తరతరాలుగా నిలిచిపోయిన పొలం సమస్యలను పరిష్కరించడానికి, ఆ రైతు కుమారులకు కూడా భవిష్యత్తులో పొలాలపై సమస్యలు ఎదురవ్వకుండా చూడడానికే ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళవారం దేగులపాడు గ్రామంలో సర్పంచి నీలకంఠ అధ్యక్షతన రెవెన్యూ కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పొలంపై పలు సమస్యలు ఉన్న 8 మంది రైతులు తహశీల్దార్ ఇజాద్ అహ్మద్‌కు దరఖాస్తులను అందజేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ... దరఖాస్తుల్లో పొందుపరిచిన వివరాలన్నీ పరిశీలించి సమస్యలకు 15 రోజుల్లోపు పరిష్కారం చూపుతామని తెలిపారు. సాగునీటి సంఘం వైస్ ఛైర్మన్ మీసాల రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి నరసింహులు, విఆర్ఒలు మల్లికార్జున, చంద్రనాయక్, సర్వేయర్ అశ్వని, అగ్రికల్చర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, డిజిటల్ అసిస్టెంట్ సుమలత పాల్గొన్నారు. **ఆస్పరి**లోని సచివాలయం-1లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ శివశంకర్ నాయక్ మాట్లాడుతూ... సదస్సులో 11 అర్జీలు వచ్చాయని, వీటిపై త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచి మూలింటి రాధమ్మ, కెడిసిసి జిల్లా మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, ఇన్‌ఛార్జీ ఆర్ఐ రంగస్వామి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, దేవదాయ శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు తిమ్మప్ప, ప్రకాష్, టిడిపి నాయకులు సతీష్, యుగంధర్, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ వినతి : నగరూరు జిల్లా ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో పాత ఏజెన్సీని మార్చి కొత్త ఏజెన్సీని ఏర్పాటు చేయాలని తహశీల్దార్ శివశంకర్ నాయక్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు రవి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 275 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. భోజనం సరిగా ఉండడం లేదని 70 శాతం విద్యార్థులు ఇంటి నుంచి బాక్సులు తీసుకొస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై ఎంఇఒ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పాత వంట ఏజెన్సీని తొలగించి కొత్త ఏజెన్సీని తీసుకోవాలని కోరారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.


చిప్పగిరిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఆస్పరిలో వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

IN THE COURT OF THE II ADDL. DISTRICT JUDGE, KURNOOL AT ADONI.
O.S.18/2022

Between:
Malekar Rukmani Bai & 19 others. ...Plaintiffs

VS

Malekar Nageswara Rao & 55 others ...Defendants

SUMMONS

To
D12: Malekar Adi Lakshmi, w/o M. Buddappa, H.no.185, Upstairs, APHB colony, Adoni.
D14: Sakary Jaya sree, D/o M. Buddappa, H.no. 185, upstairs, APHB colony, Adoni.
D15: Sakaray M. Rekha, D/o M. Buddappa, H.no.185, upstairs, APHB colony, Adoni.
D16: G. Lalitha, D/o M. Buddappa, H.no. 185, upstairs, APHB colony, Adoni.
D17: Sakaray Shanthi, D/o M. Buddappa, H.no.185, upstairs, APHB colony, Adoni.
D18: Rasalay Rajani, D/o M. Buddappa, H.no.185, upstairs, APHB colony, Adoni.
D20: N. Shiva murthy, s/o N. Narasappa, LIG.2/33-A, APHB colony, Adoni.
D 30: D. Annapurnadevi, w/o S. Narayana, MIG.106, APHB colony, Adoni.
D32: M. Mumtaz Begum, w/o M. Hussain Sab, H.no.2, SBI 2nd colony, Mandigiri college road, Adon
D34: P.N. Adilakshmi, w/o P.N. Rajasekhar Reddy, H.no.1-255/3, MIG, APHB colony, Adoni.
D42: S. Sarojamma, w/o S. Swaminath, H.no.21/456, 7th road, SKD colony, Adoni.
D45: D. Nafeez Begum, D/o D. Bashir Ahmed, D.no.24/208, Karvanpet, Adoni.

Sirs/Madam,
Please take notice that the above named plaintiffs have filed the above suit seeking the relief of declaration of their title, possession, for mandatory injunction and permanent injunction against the defendants in respect of the plaint schedule property. The above said matter is posted for your notice and appearance on 09-01-2025. You are hereby directed to appear before the above said court on the above said date at 10.30 a.m. either in person or through your counsel, else the matter will be decided by setting you ex-parte.

K. Abdul Rasheed,
D. Savitha Rani,
Advocates, Adoni.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE (MACT) ANANTHAPURAMU
M.V.O.P. No:113/2024

Between:
Mallisetti Rajesh S/o Venkatesu, D.No:25/387, Momin Street, Old Town, Ananthapuramu. **...Petitioner**

And

V.Dhanalakshmi & 2 Others **...Respondents**

NOTICE TO RESPONDENT NO:3

To,
K.Dharmaraju S/o Jayaramudu, Major, Driver of Lorry, Residing of D.No:1/10, Basapuramu (Post) Kurnool District.

పై నెంబరు దావాలోని అర్జీదారుడు నష్టపరిహారం కోరుతూ మూడవ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము పై కోర్టువారు 10-01-2025వ తేది నాటికి వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని యెడల పై కేసు మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

S.OBI REDDY,
D.RAJU,
Advocates, Ananthapuram.